నమస్తే తెలంగాణ
# నిజామాబాద్
5 | నిజామాబాద్, గురువారం 24 అక్టోబర్ 2024 | NIZAMABAD


# పింఛన్లు ఏమైనయ్ సారు?

## ఎమ్మెల్యే భూపతిరెడ్డికి మహిళల సూటి ప్రశ్న



కొత్తపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

సారంగాపూర్, అక్టోబర్ 23: నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డికి ఊహించని పరిణామం ఎదురైంది. కాంగ్రెస్ ఇస్తామన్న రూ.4 వేల పింఛన్ ఎప్పుడిస్తారని మహిళల నుంచి ప్రశ్నల వర్షం కురిసింది. బుధవారం నియోజకవర్గంలోని కొత్తపేట గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి వచ్చిన ఆయనకు మహిళల నుంచి నిరసన సెగ తగిలింది. కొత్తపేట గ్రామంలో రూ.13లక్షలతో నిర్మించిన సొసైటీ గోదాం ప్రారంభోత్సవంతో పాటు రూ.20 లక్షలతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్ర భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు ఎమ్మెల్యే గ్రామానికి వచ్చారు. ప్రారంభోత్సవం అనంతరం ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఐదింటిని అమలు చేశామన్నారు. ఈ క్రమంలో మహిళలు ఒక్కసారిగా ప్రశ్నల వర్షం కురిపించారు. కాంగ్రెస్ ఇస్తామని చెప్పిన రూ . 4 వేల పింఛన్ ఏమైందని నిలదీశారు. గ్యాస్ పైసలు కూడా ఖాతాల్లో పడడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.500లకే గ్యాస్ ఇస్తామని చెప్పారని, కానీ ఖాతాల్లో రూ.40 నుంచి రూ.60 మాత్రమే పడుతున్నాయన్నారు. స్పందించిన ఎమ్మెల్యే.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇంటింటికీ కరెంట్ సరఫరా చేస్తున్నామని గుర్తుచేశారు. త్వరలో రూ.4 వేల పింఛన్ ఇస్తామని, ఆందోళన వద్దని భూపతి రెడ్డి మహిళలకు సర్దిచెప్పారు.




# కమిటీల్లో కాంగ్రెస్ పెత్తనం

- ఎమ్మెల్యే నేతృత్వంలో జరగాల్సిన ప్రక్రియ
- హస్తం నేతల కనుసన్నల్లోనే ఎంపిక
- ప్రతిపక్షాలకు చోటు కల్పించని వైనం
- బాన్సువాడలో అధికార పార్టీలోనే చిచ్చు
- కామారెడ్డిలో కాంగ్రెస్ నాయకుల పెత్తనం
- ఇన్‌చార్జి మంత్రి పేరు చెప్పి తప్పించుకుంటున్న యంత్రాంగం

**ఇందిరమ్మ ఇండ్ల** కమిటీల కూర్పు వివాదాస్పదమవుతున్నది. కాంగ్రెస్ కనుసన్నల్లోనే ఈ ప్రక్రియ జరుగుతుండడం విమర్శలకు తావిస్తున్నది. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఉన్న చోట కూడా వారే పెత్తనం కొనసాగిస్తుండడం రాజకీయ దుమారానికి తెర లేపుతున్నది. మరోవైపు, అధికార పార్టీలో కమిటీల కూర్పు కల్లోలం రేపుతున్నది. ఎమ్మెల్యేల నేతృత్వంలో జాబితా రూపకల్పన జరగాల్సి ఉండగా, కాంగ్రెస్ లీడర్లే స్వయంగా జాబితాను రూపొందిస్తుండడం చిచ్చు రేపుతున్నది. ఈ నేపథ్యంలోనే పలు చోట్ల వివాదాలు చుట్టుముడుతున్నాయి.

–నిజామాబాద్, అక్టోబర్ 23 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

**బాన్సువాడ** నియోజకవర్గంలో కమిటీల లొల్లి తారస్థాయికి చేరింది. కాంగ్రెస్ గూటికి చేరిన మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో మండలాల వారీగా ఇందిరమ్మ కమిటీల కూర్పు చేపట్టారు. ఈ మేరకు జాబితాలను ఎంపీడీవోలకు పంపించారు. ఇందుకు ప్రతిగా మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నేత ఏనుగు రవీందర్‌రెడ్డి సైతం మరో జాబితాను రూపొందించి అధికార యంత్రాంగానికి పంపించడం తీవ్ర దుమారం రేపుతున్నది. బాన్సువాడ నియోజకవర్గంలో ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే మధ్య ప్రచ్ఛన్న యుద్ధం తారస్థాయికి చేరిందనడానికి ఇందిరమ్మ కమిటీల కూర్పే నిదర్శనంగా నిలిచింది. సవాళ్లు, ప్రతి సవాళ్లతో పోచారం, ఏనుగు మధ్య రాజకీయ పోరు మరింత ముదిరింది. ఫలితంగా కాంగ్రెస్ పార్టీ కేడర్‌లో అయోమయం నెలకొన్నది.

## పేదలకు న్యాయం దక్కేనా..?

మార్చి 11న ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకాన్ని ప్రభుత్వం లాంఛనంగా ప్రారంభించగా, నియోజకవర్గానికి 3500 చొప్పున ఇండ్లు మంజూరు చేశారు. ఈ పథకం కింద ఇండ్ల కోసం దరఖాస్తులు ఆహ్వానించగా, ఉమ్మడి జిల్లాలో లక్షల్లో వచ్చాయి. నిజామాబాద్ జిల్లాలోనే 3,32,663 మంది ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని దరఖాస్తు చేసుకున్నారు. గ్రామ సభల్లో లబ్ధిదారుల ఎంపిక చేపట్టనున్నారు. నిజామాబాద్ జిల్లాకు దాదాపుగా 19 వేల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యే అవకాశాలున్నాయి. కానీ దరఖాస్తులు మాత్రం లక్షల్లో ఉన్నాయి. కామారెడ్డిలోనూ 2 లక్షలకు పైగా దరఖాస్తులు రాగా, సుమారుగా 12వేల ఇందిరమ్మ ఇండ్లు వచ్చే వీలుంది. లక్షల్లో ఆశావాహులు ఉండగా మంజూరు మాత్రం వేలల్లోనే ఉండడంతో ఎవరికి లబ్ధి చేకూరుతుందన్నది అయోమయంగా మారింది. నిజమైన పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఊరట దక్కుతుందా? లేదా? అన్నది వేచి చూడాల్సి ఉంది.

## ఇన్‌చార్జి మంత్రి ఏం చేసేనో..?

బాన్సువాడ నియోజకవర్గంలో అధికార పార్టీ నుంచి రెండేసి జాబితాలు రావడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఏమి చేయాలో తెలియక ఉన్నతాధికారులకు వాస్తవ పరిస్థితిని రిపోర్ట్ చేశారు. చివరకు రెండు జాబితాలను ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుకు పంపించి పక్కకు జరిగారు. ఈ నేపథ్యంలో ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు నిర్ణయంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొన్నది. మరోవైపు ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాల్లో తెర వెనుక కాంగ్రెస్ నేతలు ఇందిరమ్మ కమిటీల్లో పరకాయ ప్రవేశం చేస్తున్నారు. ఎమ్మెల్యేను కాదని జాబితాను రూపొందిస్తూ కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నారు. కామారెడ్డి మున్సిపాలిటీలో జరిగిన తంతు ఇందుకు ఉదాహరణ కాగా, ఇన్‌చార్జి మంత్రి ఎలాంటి నిర్ణయాన్ని తీసుకుంటారో వేచి చూడాలి. నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఈ తంతులో మంత్రి జూపల్లి పేరునే అధికార యంత్రాంగం బద్నాం చేస్తున్నది. పది నెలల కాంగ్రెస్ పరిపాలనలో ఇన్‌చార్జి మంత్రి చుట్టపు చూపునకే పరిమితమయ్యారు. ఉమ్మడి జిల్లా టూర్‌కు వచ్చి సమీక్షలు, సమావేశాలు నిర్వహించకపోవడంతో అధికారుల్లో భయం లేకుండా పోయింది. జిల్లా కలెక్టర్లు సైతం ఇన్‌చార్జి మంత్రి పేరు చెప్పి కాలం గడిపేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## కామారెడ్డిలో ఇలా..

ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలు ఉన్న చోట పరిస్థితి ఘోరంగా మారింది. అధికార కాంగ్రెస్ పార్టీ నేతల పెత్తనంతో జాబితా రూపకల్పన గందరగోళంగా మారుతున్నది. కామారెడ్డిలో బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు ఇచ్చిన జాబితాను కాదని కాంగ్రెస్ నేతలు పంపిన జాబితాను మున్సిపల్ అధికారులు ఖరారు చేస్తుండడంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. కామారెడ్డి మున్సిపాలిటీలో ఇందిరమ్మ ఇండ్ల పథకానికి వార్డు కమిటీల ఏర్పాటులో బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు తాము ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డుల్లో అర్హులైన పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఆయా సామాజిక వర్గాల ఆధారంగా చోటు కల్పించేందుకు పూనుకున్నారు. కౌన్సిలర్ అధ్యక్షతన ఎస్‌హెచ్‌జీ నుంచి ఇద్దరు మహిళలు, వార్డులో ఉండే ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల నుంచి ఒక్కొక్కరికి చోటు కల్పించారు. సంబంధిత వార్డుకు ప్రాతినిధ్యం వహించే మున్సిపల్ ఉద్యోగి కన్వీనర్‌గా బాధ్యత వహించాల్సి ఉంది. బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు కారంగుల అంజల్‌రెడ్డి, పిట్ల వేణు, అఫీజ్, స్వప్న, నజీరొద్దీన్, భాస్కర్ ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డుల్లో వారిని సంప్రదించకుండానే మున్సిపల్ అధికారులు ఏకపక్షంగా వార్డు కమిటీలను ఖరారు చేశారు. ఇందులో కాంగ్రెస్ నాయకుల పేర్లను చేర్చారు. 43వ వార్డులో నివసించే మాజీ వైస్ చైర్మన్ మసూద్ అలీ 25వ వార్డు కమిటీలో ఎలా సభ్యుడిగా ఉంటారని బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు మున్సిపల్ కమిషనర్‌ను నిలదీశారు. 47వ వార్డులోనూ మొత్తం కాంగ్రెస్ నేతలకే చోటు కల్పించారని మండిపడ్డారు. సమాధానం చెప్పాల్సిన మున్సిపల్ అధికారులు స్పందించకపోగా అధికార పార్టీ నేతలకే వత్తాసు పలుకుతూ ఇందిరమ్మ కమిటీ కూర్పుపై ముందుకు వెళ్తున్నారు. బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు ఇచ్చిన పేర్లను కాదని రాత్రికి రాత్రే కాంగ్రెస్ నేతలు ఇచ్చే జాబితాను అధికారికంగా స్వీకరించడం నిబంధనలకు విరుద్ధమంటూ కౌన్సిలర్లు చెబుతున్నారు. అధికారిక కార్యక్రమాల్లో హస్తం పెత్తనం ఏ మాత్రం సహించేది లేదంటూ బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు చెబుతున్నారు.



# ఆలయాల్లో సౌర వెలుగులు

- తొలి దశలో జాన్కంపేట నర్సన్న ఆలయం ఎంపిక
- తొమ్మిది ఎకరాల్లో సోలార్ ప్లాంట్ ఏర్పాటు
- భూముల రక్షణతో పాటు తగ్గనున్న విద్యుత్ బిల్లుల భారం

సుభాష్‌నగర్, అక్టోబర్ 23: జాన్కంపేట లక్ష్మీనర్సింహ స్వామి ఆలయంలో సౌర వెలుగులు విరజిమ్మనున్నాయి. ఈ మేరకు ఆలయానికి చెందిన తొమ్మిది ఎకరాల స్థలంలో సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నారు. తద్వారా బహుళ ప్రయోజనాలు కలుగుతాయని అధికారులు చెబుతున్నారు. విద్యుత్ ఉత్పత్తి చేయడంతో పాటు దేవాదాయ శాఖకు విద్యుత్ బిల్లుల భారం తప్పుతుందని, అదే సమయంలో ఆలయ భూములకు రక్షణ లభిస్తుందని పేర్కొంటున్నారు. నిత్య పూజలతో పాటు ప్రత్యేక పండుగలు, కల్యాణోత్సవాల సందర్భంగా కరెంట్ పోయి తీవ్ర ఇక్కట్లు ఏర్పడుతున్నాయి. అదే సమయంలో కరెంట్ బిల్లులు దేవాదాయ శాఖకు భారంగా మారాయి. మరోవైపు, ఆలయ భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. ఇక నుంచి ఇలాంటి వాటికి చెక్ పెట్టాలన్న ఉద్దేశంతో సౌర విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలోనే ఉమ్మడి జిల్లాలో తొలి ఆలయంగా జాన్కంపేట లక్ష్మీనర్సింహ స్వామి ఆలయాన్ని ఎంపిక చేశారు. ఈ ఆలయానికి చెందిన తొమ్మిది ఎకరాల భూమిలో ప్లాంట్ ఏర్పాటు చేయనున్నారు.

### ఉమ్మడి జిల్లాలో పరిస్థితి

ఉమ్మడి జిల్లాలో దేవాదాయశాఖ పరిధిలో మొత్తం 1,357 ఆలయాలు ఉన్నాయి. వీటిలో రూ. కోటి వరకు ఆదాయం ఉన్న ఆలయాలు 6(ఎ) కింద 6 ఉండగా, రూ. 25 లక్షల లోపు ఉన్నవి 6(బి) కింద 11 ఉన్నాయి. ఇక, 6(సీ) కింద 1340, 6(డీ) కింద రెండు మఠాలు ఉన్నాయి. అన్ని ఆలయాల్లో రోజూ విద్యుత్తు దీపాలు, ఫ్యాన్లు, ఏసీలు పనిచేస్తూనే ఉంటాయి. ఆయా దేవాలయాలకు ప్రతి నెల సుమారు రూ. 5 వేల నుంచి రూ.12 వేల వరకు విద్యుత్తు బిల్లులు వస్తున్నాయి. ఇక, ప్రత్యేక పూజలు, ఉత్సవాల్లో అలంకరించే రంగురంగుల దీపాలు, ఇతరత్రా వాటితో వినియోగం పెరిగి రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు విద్యుత్ చార్జీలు చెల్లించాల్సి వస్తున్నది. ఈ క్రమంలో ఒక్కో దేవాలయానికి ఏడాదికి సగటున రూ. లక్షకు పైగా బిల్లులు చెల్లిస్తున్నట్లు దేవాదాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

### ఉమ్మడి జిల్లాలో ఏకైక ఆలయం

ఉమ్మడి జిల్లాలో ఎడపల్లి మండలం జాన్కంపేటలోని శ్రీలక్ష్మీ నర్సింహస్వామి దేవాలయానికి చెందిన 9 ఎకరాల్లో త్వరలో సోలార్ విద్యుత్ ప్లాంటు ఏర్పాటు చేయనున్నారు. రానున్న సంక్రాంతి లోపు పనులు సైతం పూర్తవుతాయని దేవాదాయశాఖ అధికారులు చెబుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా తొలిదశలో 5 దేవాలయాలకు చెందిన 230 ఎకరాలను గుర్తించారు. అందులో జాన్కంపేట లక్ష్మీ నర్సింహస్వామి దేవాలయం ఎంపిక కావటం విశేషం.

### భూములు కబ్జా కాకుండా..



"ఆలయాలకు వచ్చే ఆదాయంలో 20 నుంచి 40 శాతం విద్యుత్ బిల్లులకే చెల్లించాల్సి వస్తున్నది. దీన్ని అధిగమించేందుకు ఇంధన వనరుల పొదుపు సంస్థ, రాష్ట్ర దేవాదాయ ధర్మదాయ శాఖ ఆదేశాలతో గత మే నెలలో 11 ప్రధాన దేవాలయాల్లో సౌర విద్యుత్ ఏర్పాటు చేయడానికి ప్రతి పాదనలు పంపించాం. తొలిదశలో జాన్కంపేట ఆలయ భూముల్లో ప్లాంటు ఏర్పాటుకు ఎంపికైనట్లు తెలిసింది. అధికారికంగా ఆదేశాలు రావల్సి ఉంది.

- విజయరామారావు, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్




## 'ఫీజుల' కోసం విద్యార్థుల మహాధర్నా

ఖలీల్‌వాడి, అక్టోబర్ 23: ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని బుధవారం నిజామాబాద్‌లోని ధర్నాచౌక్ వద్ద విద్యార్థులు మహా ధర్నా నిర్వహించారు. ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ఆందోళనకు భారీగా తరలివచ్చిన విద్యార్థులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇవ్వక పోవడంతో ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలు ఇటీవల బంద్ పాటించినా సర్కారులో చలనం రాలేదన్నారు. నిధులు విడుదల చేయకపోతే ఉద్యమం లేవదీస్తామని హెచ్చరించారు. ఏఐఎస్‌ఎఫ్ ప్రతినిధులు బానోత్ రఘురాం, అంజలి, నవీన్‌కృష్ణ, వంశీ, కుషాల్, కార్తిక్, గోదావరి పాల్గొన్నారు.

## రేపటి నుంచి మాధవ్‌నగర్ రైల్వేగేటు మూత

డిచ్‌పల్లి, అక్టోబర్ 23: నిజామాబాద్ నగర శివారులోని మాధవ్‌నగర్ రైల్వే గేటును రేపటి (శుక్రవారం) నుంచి మూడు రోజుల పాటు మూసివేయనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. మరమ్మతుల కారణంగా ఈ నెల 27 వరకు గేటును మూసి ఉంచుతామని, ప్రయాణికులు బైపాస్ మీదుగా వెళ్లాలని ఓ ప్రకటనలో సూచించారు.




మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మున్సిపల్ అవుట్ సోర్సింగ్ సిబ్బంది

## డిమాండ్లు నెరవేర్చాలని ఆందోళన

కంఠేశ్వర్, అక్టోబర్ 23: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ అవుట్ సోర్సింగ్ సిబ్బంది బుధవారం నిజామాబాద్ మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కనీస వేతనం రూ.26 వేలు చేయాలని, రూ.50 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. బీఎల్‌టీయూ అధ్యక్షుడు దండి వెంకట్, బహుజన మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఉమ్మడి జిల్లా గౌరవ అధ్యక్షురాలు సబ్బాని లత, ప్రధాన కార్యదర్శి మేకల రాజేందర్, వాటర్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు రాహుల్, హరీశ్ పాల్గొన్నారు.

## అర్హులైన రైతులకు న్యాయం చేయండి

### జాతీయ ఎస్టీ కమిషన్ ఆదేశం



కాద్లాపూర్‌లో మాట్లాడుతున్న హుస్సేన్ నాయక్

బాన్సువాడ రూరల్/ఇందల్వాయి, అక్టోబర్ 23: పోడు భూములు సాగు చేసుకుంటున్న అర్హులైన రైతులకు న్యాయం చేయాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ ఆదేశించారు. గిరిజనులను అకారణంగా ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. బాన్సువాడ మండలం కాద్లాపూర్ గ్రామానికి చెందిన కొందరు ఎస్టీలు ఇటీవల జాతీయ కమిషన్‌కు ఫిర్యాదు చేయగా, స్పందించిన కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్ బుధవారం కాద్లాపూర్‌కు వచ్చారు. పోడు భూములలో సాగు చేసుకుంటున్న అర్హులైన రైతులకు అటవీశాఖ, రెవెన్యూ అధికారులు సమన్వయంతో విచారణ చేపట్టి న్యాయం చేయాలని ఆదేశించారు. కలెక్టర్ కిరణ్మయి, డీఎస్పీ సత్యనారాయణగౌడ్, తహసీల్దార్ వరప్రసాద్ ఉన్నారు.

### ఇవేం వసతులు?

ఇందల్వాయి మండలంలోని ఏకలవ్య గురుకుల పాఠశాలలో వసతులు సరిగా లేకపోవడంపై ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం పాఠశాలను సందర్శించిన ఆయన.. 2017లో పాఠశాల ప్రారంభమైతే ఇప్పటివరకు సరైన వసతులేక పోవడంపై అధికారులను నిలదీశారు. మరోసారి వస్తానని, ఏర్పాట్లు చేయకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. అడిషనల్ కలెక్టర్ అంకిత్, డీటీడీఓ నాగోరావు, రజిత, ఆర్‌సీవో గంగారాంనాయక్, డీసీవో సోమ్లనాయక్, తహసీల్దార్ వెంకట్‌రావు, ఎంపీడీవో లక్ష్మారెడ్డి ఉన్నారు.